# ప్లీడరు నోటీసు

## కె. అమ్మిరాజు

"ప్లీడరుగారూ, నేనొకళ్ళకి నోటీసివ్వాలండి" అన్నాడు శేషగిరి పెద్ద సీరియస్‌గా ముఖంపెట్టి.

"ఓ దానికేం నిక్షేపంలా ఇయ్యండి." అన్నారు ప్లీడరుగారు కోర్టుకు వెళ్ళడానికి హడావుడిగ కోటు తొడుక్కుంటూ.

ప్లీడరుగారికి ఫీజువ స్తేచాలు. మరే మక్కర్లేదు. నోటీసేమిటి ఎవరికివ్వాలి అన్న ధ్యాసే వుండదు. దానికితోడు తొందర.

"ఒరేయ్! వెంకాయ్, ఈయనెవరికో నోటీసివ్వాలిట చూడు అని హడావుడిగా పురమాయించి, తొందర తొందరగా కారెక్కి తుర్రుమన్నారు కోర్టుకి.

వెంకయ్య ప్లీడరుగారి దగ్గర జూనియరు గుమాస్తా. చిన్నప్పటినుంచీ ప్లీడరుగారింట్లో పిల్లల్నాడిస్తూండేవాడు. పెద్దయ్యాక అక్షరంముక్క నేర్చుకుని గుమాస్తాగా దేరాడు. ఎంతచెప్తే అంతేఘటం. చెప్పిన జేదో తూచా తప్పకుండా చేసెయ్యడమే గాని, ఏంచేస్తున్నామో అనేజ్ఞానమే వుండదతనికి. వెంటనే ప్లీడరుగారికి రావలసిన ఫీజూ తనకి రావలసిన మామూలు తీసుకుని కాగితం, కలం తీసుకున్నాడు:

"శ్రీ రాఘవయ్యగార్కి,

నిన్న నే బజారులో పనిలేక తిరుగుతూంటే పుస్తకం కొంటున్న ఒకమ్మాయిని చూశాను. వెంటనే ఆ అమ్మాయి నాకోమల హృదయాన్నపహరించివేసింది. ఎవరా అంతగొప్ప గజదొంగ అని ఆరాతీస్తే తమ కొమార్తె అని తేలింది. నా హృదయాన్ని దొంగిలించినందుకు ఆమె గార్డియన్ అయిన మీకు నోటీసిస్తున్నాను. ఈ నోటీసందిన వారంరోజులలోపుగా నాసొత్తును నాకు జేరిస్తేసరే సరి. లేకపోతే పరిహారం వెంటనే ముట్టజెప్పాలి. అట్లా కానిపక్షంలో మీమీద క్రిమినలుగా ప్రాసీడవగలను."

శేషగిరి వ్రాలు."

వెంకయ్య వ్రాయటం పూర్తిచేసి శేషగిరి కిచ్చాడు. శేషగిరంతా చదివి సరిపోయిందని సంతృప్తితో బుర్రాడించాడు. వెడుతూ వెడుతూ వెంకయ్యని పక్కకిపిల్చి నోటీసు వెంటనే పోషుచేయమని చెప్పి మరి రెండు రూపాయలుతీసి చేతిలోపెట్టాడు. నోటీసాపూ లేపోస్టుకు వెళ్ళిపోవాలని నొక్కి నొక్కి చెప్పాడు.

రూపాయలు చూడ్డంతోటే వెంకయ్య కళ్ళు మిలమిల మెరిశాయి. ఉన్నపనంతా వదిలేసి పరుగుతీశాడు కోర్టుకు. ప్లీడరుగారి సంతకం పెట్టించేసి పోస్టుచేశాడు.

రాఘవయ్యగారప్పుడే కోర్టునించి వచ్చి డ్రస్సుమార్చుకుని కుర్చీలో కూర్చుని వేడి వేడి కాఫీ త్రాగుతున్నారు. ఇంతలో పోస్టుమేన్‌వచ్చి రిజిష్టరు నోటీసందిచ్చాడు.

నోటీసు చూసేటప్పటికి రాఘవయ్యగారి కోపం ఆకాశాన్నంటుకొంది. "ఎంత మొండి ధైర్యం వాడికి, నాకే నోటీసిచ్చే వాడు. చెప్తా వాడిపని చెప్తా" అనుకున్నారు కవరన్నా విప్పి చూడకుండా వూరికే యిటూఅటూ, తిప్పి చూస్తూ.

"రానియ్యి చెప్తా. ఈ రాఘవయ్యతోనా కోర్టు వ్యవహారాలు" అనుకుంటూ నోటీసు హడావుడిగ చదివేశారు. ఆయనకి తలాతోకా ఏమీ బోధపడలేదు. మతి పోయింది. 'హు' అని పళ్ళుబిగించి యింకో సారి చదివేశారు.

'ఎవడీ మూర్ఖుడు? మా అమ్మాయి వాడి మనసు దొంగిలించేసిందంటాడు' అని ఒక్క క్షణమాలోచించి, 'ఏమేవ్' అని పొలికేకెట్టారు.

"ఆ! ఒస్తున్నా ఏమిటా పొలికేకలు మీరునూ?"

"ఆ గిరిగాడు, అంటే శేషగిరిగాడు ఎవడే?"

"ఏమిటీ పూట వాడిమీద విరుచుకు పడుతున్నారు? ఏం మునిగింది?"

"కొంపే మునిగింది. అప్రాచ్యుడు. లేకపోతే నాకు నోటీసిస్తాడా? వుండు వాడి పని చెప్తా."

"అసలు సంగతేమిటో చెప్పక వూరికే హడావుడి చేస్తారే?"

"హడావుడేమిటి? వెధవ సినిమాలన్నీ వచ్చి లోకమంతా పాడయిపోయింది. ఎక్కడ చూసినా ప్రేమా, ప్రేమ. కొట్లో పుస్తకాలు కొంటూన్న మనమ్మాయిని చూసేశాడట. అది వాడి హృదయం దొంగిలించేసిందిట. అందుకని మనం పరిహారమివ్వాలిట. లేకపోతే దావావేస్తానని బెదిరిస్తాడు. వేసుకోనీ, ఈ రాఘవయ్య దగ్గరా దావాలు, లావాదేవీలూనూ!"

"ఇదెక్కడినోటీసండి? ఎప్పుడూ వినలేదే?"

"నేమాత్రం విన్నానేమిటి? నా మొహం దీనికి ప్లీడరు నోటీసు గూడాను."

"ప్లీడరు నోటీసా? ఎవరండి ఈ కేసు తీసుకున్న మహానుభావుడు?"

"కంగారులో నేనది చూడ్డం మరచేపోయా చూశావా!" అంటూ నోటీసంతా యింకోసారి పరీక్షించేశాడు. దాంతో ఆయనకి చెమటలు క్రమ్మాయి. ముఖం పాలిపోయింది.

"ఏమిటండీ అలా అయిపోయారే?"

"ఏమీ లేదు. సర్లే నువ్వుపో."

"ఇంతకీ ఎవడా బుద్ధిలేని ప్లీడరు?"

"అబ్బనే నేనే, ఆ బుద్ధిలేని ప్లీడర్ని, చంపక యింకపో"

దాంతో ప్లీడరుగారి భార్యపొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వింది. ప్లీడరుగారగ్గి రుద్రుడై పోయాడు.

"ఘాఱ్మంటే!

"సంగతేమిటో పాంతం తేలనివ్వకుం




రవి టాయిలెట్స్ అందముకు, వర్చస్సుకు

రవి గ్లిసరిన్ సోప్:—అన్ని కాలముల్లో, ముఖ్యంగా వేసవికాలములో వాడదగినది. శరీరమును మృదువుగను, కాంతిగనుఉంచును.

రవి వెజిటబుల్ హేరాయిల్:- శిరోజములను విస్తారంగా పెంపొందించును. దానిదక్కని సున్నితమైన సువాసన అందరికి ఆనందము కలుగచేయును.

రవి స్నో:-ముఖవర్చస్సును కాపాడి, విలాసమును పెంపొందించును. సోల్ఏజెంట్లు:-

ది న్యూస్టార్ & కంపెని, 10, వైద్యనాథ మొదలివీధి, తండియార్పేట, మద్రాసు-21.

# ప్లీడరు నోటీసు

డానే? ఇంతకీ అంత బుద్ధిలేని పనెల్లా జేశారు?"

"వెంకయ్యగాడో మొద్దుఘటం. చెప్పింది రాసుకోడమేగాని, ఏం రాస్తున్నాడో వాడికే తెలియదు. శుద్ధ మొద్దు."

"వాడురాసిం దానిమీద గుడ్డిగా సంతకం పెటడమేగాని, ఏం రాశాడో చూద్దామనిన్నా వుండదు మీకు."

"పోవే చచ్చినపామునేం చంపుతావింక. వెంకయ్యగాడు నురగలు కార్చుకుంటూ పరుగెత్తుకొచ్చి, అర్జంటని ఏడవకపోతే నేను మాత్రం అంత గుడ్డిగా సంతకం పెడుదునా?"

"బాగానే వుంది. అవకతవక మహారాజు మందమతి మహామంత్రి! ఇంతకీ ఏంచేయ దల్చారు?"

"ఏంచేయదల్చానా? ఒగుల్తా నావాడిని? ఈ రాఘవయ్యతో దావా అంటే కత్తిమీద సాము అని తెలియదూ? ముప్ఫయి కోర్టులు తిప్పి మూడు చెరువుల నీళ్ళు త్రాగింపనూ?"

"చాల్లెండి. ఎవరైనా వింటే నవ్వుతారు."

"ఎవడా నవ్వేది?"

"పోనీ వాకబుచేసి చూడరాదూ మన మ్మాయి కేదు జోడునేమో? పరిహారం చెల్లించేద్దాము."

"ఏడిసినట్టుంది. వాడే దమ్మిడీకి కొరగాని లేనివాడో, అనాకారో, రోగిష్టో."

"అదే వాకబు చేయమంటూంట. మన వెంకయ్యని పిలిచి అడగరాదూ?"

"వాడికింకా జ్ఞాపకముంటుందే? అయినా అడిగిచూద్దాము."

"ఒరేయ్ వెంకా!..."

"వస్తున్నా సార్."

"ఏరా నిన్ని నోటిసిచ్చాడే ఎవడో శేషగిరి. ఎవడ్రా వాడు? ఎల్లావున్నాడు?"

"ఓ ఆయనా! నలభయ్యేళ్ళుంటాయండి. పొట్టిగా, గూటంలా,......"

"చాల్చాలు నువ్వు పో. ఏమే చూశావా నేచెప్తే విన్నావా!"

"మీరుండండి నేనడుగుతాను. ఏరా నీకు బాగా జ్ఞాపకముందా ఆయనే శేషగిరని?"

"అదేమిటండమ్మా అల్లా అడుగుతారు? అయ్యగారి దగ్గరకు రోజూవచ్చే ఆయన్ని ఎరగనండి నేను?"

"నాదగ్గరకి రోజూవస్తాడా?"

"అవునండి. సాయంత్రమప్పుడు మీరిద్దరూ కూర్చుని ఛస్సాడుకుంటారు కూడాను."

"నీముఖం ఆయన శేషాచలం."

"ఆయ నేనండి నే చెప్తూంట."

"ఏడిసినట్టుంది నీతో వ్యవహారం. శేషగిరిని అడిగితే శేషాచలాన్ని గురించిచెప్తావే?"

"అయితే నాకు తెలియదండి?"

"ఏమిటండీ శేషగిరంటున్నారు?" అంటూ స్ప్రింగు తలుపు త్రోసుకు లోపలికొచ్చారు వెంకట్రామయ్యగారు.

"చాలారోజుల కొచ్చారు అన్నయ్యగారు, వుండండి కాఫీ తెస్తా."

"అబ్బెబ్బే వద్దండి ఇప్పుడే త్రాగి వస్తున్నా."

"మొహమాటం పడితే లాభం లేదండి" అంటూ యింట్లో కెళ్ళి యింకో కప్పు కాఫీతో వచ్చారు ఆమెగారు.

చల్లారిన కాఫీ ఒక్కగుక్కలో త్రాగేశారు ప్లీడరుగారు.

"నిన్న మద్రాసునించి మా అబ్బాయి వచ్చాడండి. ఈపూట తీసుకువద్దామనుకుంటే చెప్పకుండా పెట్టకుండా సినీమాకి పోయాడు."

"పోన్లెండి. రేపు తీసుకొద్దురుగాని. తొందరేం? పేరేమిటండీ, మర్చిపోయాను?"

"శేషగిరండి."

"శేషగిరా?" ప్లీడరుగారు తెల్లబోయి తమాయించుకుని డ్రాయరు సొరుగు లాగి కవరు పైకితీశారు.

"ఇదిగో ఈ ఎడ్రసు చూడండి?"

"అరె! మా అబ్బాయి ఎడ్రసేనే! ఇదిగో c/o వెంకట్రామయ్యగారు 280/11 క్రొత్త వీధి అనికూడా వుంటేనే."

"నే చెప్పానా ముందే! విచారించి చూడండీ అని," అంది ప్లీడరుగారి భార్య ఆనందంతో వుబ్బి తబ్బిబ్బై.

"మీ ఎడ్రసేనా? బాగా చూశారా?"

"ఆ నిశ్చయంగా."

"మీ ఎడ్రసేనన్నమాట! నాల్గైదు సార్లు చదివినా కూడా నా కావిషయం తోచనే లేదు చూడండి!"

"ఆ ఎందుకు తెలుస్తుంది లెండి. మీ మనస్సంతా కోర్టులు, చెరువులమీద వుంది" అంది ఆవిడ సన్నసన్నగా.

"ఇంతకీ ఏమిటండీ ఆ వుత్తరం?"

"ఏముందిలెండి మీ పుత్రరత్నం నోటీసిచ్చాడు." వెంకట్రామయ్యగారు తెల్లబోయారు. "మావాడు మీకు నోటిసివ్వడమా?"

"అవును. తగిన పరిహార మివ్వకపోతే క్రిమినల్ గా ప్రాసీడవుతానని కూడా బెదిరించాడు. పరిహారం సమర్పించి చేతులు ముడుచుకుంటానులెండి. ఆగ్రహించకండి." అన్నారు ప్లీడరుగారర్థపూరితంగా నవ్వుతూ.

"ఇంతకీ నోటీసు దేనికి?"

"మనం ప్రయత్నిస్తున్న దతనే చూసుకున్నాడు. మీరే చిత్తగించండి." నోటీసందిచ్చారు ప్లీడరుగారు ఆనంద తన్మయత్వంలో తేలియాడుతూ.

వెంకట్రామయ్యగారు "ఏం కొంపముంచాడో"నని తడబడుతూ, నోటీసందుకున్నాడు.

ఆయన తడబాటు చూసి ప్లీడరుగారి భార్య ముసిముసి నవ్వులు నవ్వుకుంది. ★




నారసింహ లేహ్యము
బంగారుతో చేరినది మేహము, నిక్షాత, నిస్సత్తువ వగైరా హరించి. బలము రక్తవృద్ధి కల్గించును. 20 తు. డబ్బీ రు 3-4-0 పోస్టేజీ రు.1-1-0.
వి. సి. ఏ. అండ్ కో, (ఆయుర్వేద సమాజం)
పెరిదేవి (పోస్టు) — నెల్లూరుజిల్లా.

శుభ్రమైన, గట్టి పళ్ళు

ఆక్టివ్ క్లోరోఫిల్ గల
అద్భుతమైన ఆకుపచ్చని
కోలినోస్ టూత్‌పేస్ట్




* మీ పళ్లను శుభ్రముగా మరియు మెరుస్తూ ఉండేలా ఉంచును
* దంత క్షయాన్ని కలిగించే క్రిములను అడ్డును
* మీ యిగుళ్లను గట్టిగా ఉంచుటలో సహాయపడును
* నోటి దుర్వాసనను తొలగించును

'కోలినోస్' ప్రత్యేకతే దాని మహిమే!

GK. 3029
జియోఫ్రే మేనర్స్ & కంపెనీ, ప్రైవేట్ లిమిటెడ్, రిజిస్టర్డ్ యూజర్